
వేములవాడ : వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కోనరావుపేట : బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి


గంభీరావుపేట : తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద నినదిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ముస్తాబాద్ : సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

# బండెనక బండి కదిలె..

## దారులన్నీ ఎల్కతుర్తి వైపే

- జిల్లా నుంచి కదిలిన బీఆర్ఎస్ దండు
- వేలాది వాహనాల్లో పయనం
- స్వచ్ఛందంగా తరలివెళ్లిన ప్రజలు, యువకులు
- దారుల వెంట జాతర

**మరో చారిత్రక ఘట్టానికి వేదికైన ఎల్కతుర్తికి గులాబీ దండు కదిలింది. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఉప్పెనలా కదిలింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి లక్షలాది మంది వెళ్లగా, ఏదారి చూసినా గులాబీమయమై కనిపించింది. యువత, ప్రజలు స్వచ్ఛందంగా తరలగా, పొద్దు పొడుపు నుంచే బండెనక బండి కట్టి వేలాది వాహనాల్లో బయలుదేరి మధ్యాహ్నం కల్లా మీటింగ్ స్పాట్‌కు పోటెత్తింది. జై కేసీఆర్.. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించి, అధినేతకు నీరాజనం పట్టింది.**

రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ)/కోనరావుపేట/గంభీరావుపేట/ఇల్లంతకుంట/సిరిసిల్ల టౌన్/ముస్తాబాద్/రుద్రంగి/ వేములవాడ రూరల్/ బోయినపల్లి రూరల్/చందుర్తి, ఏప్రిల్ 27: బండెనక బండి కట్టి..బస్సెనక బస్సు పెట్టి రజతోత్సవ సభకు గులాబీ దండు కదిలింది. పల్లె, పట్టణమంతా కలిసి కదనోత్సాహంతో ఎల్కతుర్తికి తరలింది. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు జరిగే బీఆర్ఎస్ పాతికేళ్ల పండుగకు వెళ్లే వారంతా ఉదయం నుంచే వరంగల్ బాట పట్టారు. జిల్లాలోని ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేటు బస్సులు, స్కూల్ బస్సులు సమకూర్చినా సరిపోక ఇతర జిల్లాల నుంచి వాహనాలు తెప్పించారు. నిన్నటి దాకా దంచికొట్టి సుర్రుమన్న ఎండలతో వేడెక్కిన వాతావరణం చల్లబడింది. ఉద్యమ నేత కేసీఆర్ నిర్వహించిన సభకు భానుడు కూడా కరుణించాడు. వరంగల్‌కు బయలు దేరిన గులాబీ శ్రేణులకు ఎండ దెబ్బ తగలకుండా చేశాడు. చల్లటి వాతావరణంలో రెట్టింపు ఉత్సాహంతో కార్యకర్తలు, ప్రజలు వందల సంఖ్యలో తరలి వెళ్లారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, గూడూరి ప్రవీణ్, నాయకులు బొల్లి రామ్మోహన్‌తో కలిసి జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పార్టీ జెండాను ఎగురవేసి వరంగల్‌కు కార్యకర్తలను వెంట పెట్టుకుని పయనమయ్యారు.


సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణం నుంచి వరంగల్ సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు


రుద్రంగి : పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఇల్లంతకుంట : పార్టీ జెండావిష్కరణలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల నియోజకవర్గంలోని ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాలధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు వార్డు కమిటీల నాయకులు పెద్ద సంఖ్యలో బస్సులు, కార్లలో బయలుదేరి వెళ్లారు. వేములవాడ నియోజకవర్గంలో ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఏనుగు మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో చందుర్తి, రుద్రంగి, కథలాపూర్, వేములవాడ, కోనరావుపేట, బోయినపల్లి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి వెళ్లారు. వివిధ మండలాల నుంచి ఉదయం 9 గంటలకే కార్యకర్తలు తరలివెళ్లారు. బస్సులకు గులాబీ జెండాలు కట్టి, కండువాలు ధరించారు. జైతెలంగాణ, జైకేసీఆర్ అన్న నినాదాలతో ఉద్యమ కాలం నాటి రోజులు గుర్తుకు వచ్చేలా కార్యకర్తల దండు కదిలి వెళ్లింది. జిల్లా నుంచి ఇరవై వేలమందిని తరలించాలన్న అంచనా దాటింది. ఎక్కువ సంఖ్యలో జనం రావడంతో బస్సులు చాలక స్కూల్ బస్సులు ఏర్పాటు చేశారు. వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లో జెండాలను ఆవిష్కరించి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పార్టీ కార్యకర్తలు, నాయకులు తెలంగాణ చౌక్‌కు చేరుకున్నారు. తెలంగాణ చౌక్ వద్ద పార్టీ జెండాను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి జెండా ఆవిష్కరించారు. వేములవాడ పురపాలక సంఘం పరిధి నుంచి వెయ్యి మంది సభకు తరలివెళ్తున్నామని తెలిపారు. ఇక్కడ పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కందుల కుమార్, సహకార సంఘం అధ్యక్షుడు ఏనుగు తిరుపతి రెడ్డి, మాజీ కౌన్సిలర్ నిమ్మ శెట్టి విజయ్, తదితరులున్నారు. కోనరావుపేట మండలం నుంచి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్లు సంకినేని రామ్మోహన్‌రావు, బండ నర్సయ్య, యువజన విభాగం మండలాధ్యక్షుడు జీవన్‌గౌడ్, మాజీ జడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సింగిల్ విండో వైస్ చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, మహేశ్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సీనియర్ నేతలు న్యాలకొండ రాఘవరెడ్డి తరలివెళ్లారు.

గంభీరావుపేట మండలం నుంచి బీఆర్ఎస్ సభకు సుమారు 2,500 తరలివెళ్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి గౌడ్ తెలిపారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, లింగన్నగారి దయాకర్‌రావు, తదితరులున్నారు. ఇల్లంతకుంట మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు పార్టీ జెండాలను ఆవిష్కరించి బస్సుల్లో సభకు వెళ్లారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో తెలంగాణ తల్లి, చాకలి ఐలమ్మ విగ్రహాలకు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో కార్మిక క్షేత్రం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. సిరిసిల్ల నుంచి దాదాపు 60కి పైగా బస్సులు, 100 ప్రైవేట్ వాహనాల్లో సుమారు 5వేల మందికి పైగా కేసీఆర్‌ను చూసేందుకు కదలివెళ్లారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ యూత్, బీఆర్ఎస్ కార్మిక విభాగం, బీఆర్ఎస్ మహిళా విభాగం, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులున్నారు. వీర్నపల్లి మండలంలోని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. శంకరపట్నం రోడ్డులో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు పోచమ్మకు మండల బీఆర్ఎస్ నాయకులు వాటర్ బాటిల్, మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు అందజేశారు. ఇక్కడ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు ఎడ్ల సాగర్, బంజారా సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేశ్‌నాయక్, బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు సామల దేవరాజు, తదితరులున్నారు. ముస్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఇక్కడ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజి రెడ్డి, మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, మాజీ రైతు బంధు అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, సీనియర్ నాయకులు సర్వర్‌పాషా, ఆనంద్‌రావు, ఎద్దండి నర్సింహారెడ్డి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ తదితరులున్నారు. రుద్రంగి మండలంలోని గ్రామాల నుంచి దాదాపు 250 మంది బీఆర్ఎస్ నాయకులు సభకు తరలివెళ్లారు. పార్టీ గ్రామాధ్యక్షుడు దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి, బీఆర్ఎస్ నాయకులు బస్టాండ్ ఆవరణలో పార్టీ జెండా ఆవిష్కరించి బస్సుల్లో తరలివెళ్లారు. ఇక్కడ బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు కొడగంటి శ్యామ్, నాయకులు గంగం మహేశ్, మంచె రాజేశం, తదితరులున్నారు. బోయినపల్లి మండలం నుంచి దాదాపు 1500 పైగా బీఆర్ఎస్ నాయకులు సభకు తరలి వెళ్లారు. ఇక్కడ రాష్ట్ర నాయకులు అమిత్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ నాగయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు అజ్జు, ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, నాయకులున్నారు. వేములవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు జెండాలు ఆవిష్కరించిన అనంతరం వాహనాల్లో సభకు తరలి వెళ్లారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొస్కుల రవి, మాజీ సర్పంచులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, గ్రామాధ్యక్షులున్నారు.

చందుర్తి మండలం నుంచి మండలాధ్యక్షులు ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు తదితర బీఆర్ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

### జనం గుండెల్లోంచి పుట్టింది గులాబీ జెండా

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య


సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా జనం గుండెల్లో నుంచి పుట్టిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో గులాబీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ప్రగతిశీల తెలంగాణ కోసం జాతిపిత కేసీఆర్ అందించే పిలుపును వినేందుకు రాష్ట్ర ప్రజానీకం వరంగల్ బాట పట్టిందన్నారు. అనంతరం వాహనశ్రేణిలో సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, న్యాలకొండ రాఘవరెడ్డి, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, కుంబాల మల్లారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.



వీర్నపల్లి : సభకు తరలివెళ్తున్న మండల బీఆర్ఎస్ నాయకులు



ముస్తాబాద్ : కేసీఆర్, కేటీఆర్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న మహిళా నాయకురాలు


చందుర్తి : వరంగల్ సభకు బయలుదేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు


వేములవాడ రూరల్ : అనుపురంలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న గ్రామాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ


బోయినపల్లి రూరల్ : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అ'పూర్వ' సమ్మేళనాలు


వేములవాడ టౌన్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కోనరావుపేట, ఏప్రిల్ 27: మండలంలోని సుద్దాల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం వారికి విద్యాబోధనలందించిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఇక్కడ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులున్నారు.

వేములవాడ టౌన్, ఏప్రిల్ 13 : 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. తమ చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆటాపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఇక్కడ బుట్టం దేవరాజు,లక్ష్మి, డ్రైవర్ శ్రీనివాస్, శ్రీధర్‌యాదవ్, రాము, కోటగిరి రాజశేఖర్, ఊరడి రాంరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


కోనరావుపేట: సమ్మేళనంలో పాల్గొన్న సుద్దాల పాఠశాల పూర్వ విద్యార్థులు

## సమస్యల పరిష్కారాలకు కృషి


శృంగేరి వెళ్లిన అనువంశిక అర్చక ట్రస్ట్ బృందం సభ్యులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 27 : దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, పునర్నిర్మాణంలో ఇక్కడి అనువంశిక అర్చక ట్రస్ట్ ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తానని, ఈ విషయాన్ని దేవాదాయశాఖ అధికారులకు తెలియజేస్తానని శృంగేరి పీఠాధిపతులు హామీ ఇచ్చారు. వేములవాడ అనువంశిక అర్చక ట్రస్ట్ ప్రతినిధుల బృందానికి చెందిన 12 మంది శృంగేరి పీఠాధిపతులను కలిసి, వారికి వినతి పత్రాన్ని అందజేశారు. వేములవాడ క్షేత్రంలో కొనసాగుతున్న అనువంశిక అర్చకత్వ సమస్య పరిష్కారానికి, ఖాళీలుగా ఉన్న వేతన పరిచారక పోస్టుల భర్తీకి కూడా దేవాదాయశాఖ అధికారులకు వివరిస్తానని పీఠాధిపతులు హామీ ఇచ్చినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఇక్కడ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ట్రస్ట్ ప్రతినిధులు పురాణం రాము, మామిడిపెల్లి వెంకటేశం, బుడెంగారి మహేశ్, వర్ఘుల సతీశ్, శ్యాం, మందిరం రఘు, వాసాలమర్రి నాగరాజు, చెర్లపెల్లి సీతారాములు, పౌరాణికులు ముదిగొండ మల్లికార్జునశర్మ తదితరులున్నారు.

## రాజన్న ఆలయ విస్తరణకు శ్రీకారం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 27 : వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనులు శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీతీర్థ స్వామివారి అనుమతితో ప్రారంభంకానున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న ఆలయ విస్తరణపై విప్‌తోపాటు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీతీర్థ స్వామివారిని కలిసి వారితో విపులంగా చర్చించారు. సుదీర్ఘ చర్చల అనంతరం, ప్రతి అభివృద్ధి పనిని క్షుణ్ణంగా పరిశీలించి ఆలయ విస్తరణపై ముందుకు వెళ్లాల్సిందిగా సూచించారు. వారి వెంట ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అధికారులున్నారు.

## కాలనీకి నీళ్లొచ్చినయ్

- నమస్తే కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: వెంకటాపూర్‌లోని ఒకటి, ఏడో వార్డులో వారం రోజుల నుంచి నీళ్లు రావడం లేదని నిరసన తెలుపగా, 'నమస్తే తెలంగాణ'లో తాగునీటి కోసం మహిళల నిరసన పేరిట కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. దీంతో ఆదివారం కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. తమ కాలనీకి నీటి సమస్య పరిష్కారమైందని భవిష్యత్తులో సమస్య రాకుండా చూడాలని అధికారులను వేడుకున్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు

- ఒంగోలుకు చెందిన ఇద్దరు యువకుల మృతి
- పదిర శివారులో ఘటన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను ప్రమాదవశాత్తూ కారు ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాదకర ఘటన ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు జిల్లాకు చెందిన మధు (22), మహేశ్(23) రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట కేంద్రం నుంచి సిరిసిల్ల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో పదిర శివారులో వీరి బైక్‌ను సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న ఓ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధు, మహేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనం

గంభీరావుపేట, ఏప్రిల్ 27: నాగంపేటలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన పదిండ్లలో దొంగతనం చేశారు. మొత్తం నాలుగు తులాల బంగారం, 65 తులాల వెండితో పాటు రూ.30 వేల నగదు, ల్యాప్‌టాప్‌ను ఎత్తుకెళ్లారని పోలీసులు తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. గ్రామంలో దొంగతనం జరిగిన తీరుపై డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

రుద్రంగి, ఏప్రిల్ 27: మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మహిళ ఎల్లదేవా రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. ఇది గమనించిన దుండగులు ఇంట్లోకి ప్రవేశించి 6 గ్రాముల బంగారాం, 5 వేల నగదు దొంగలించారని తెలిపారు. ఎస్ఐ అశోక్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## స్వర్ణకారుల దీక్షకు బీఆర్ఎస్ నాయకుల మద్దతు

ముస్తాబాద్, ఏప్రిల్ 27 : మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న స్వర్ణకారులకు ఆదివారం బీఆర్ఎస్ మహిళా నాయకులు, మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు మద్దతు తెలుపుతూ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి బంగారు నగలు విక్రయించడంతో కుల వృత్తిపై ఆధారపడిన స్వర్ణకారులు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్వర్ణకారులకు చేయూతనందించాలని కోరారు. ఇక్కడ మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజు బాలయ్యతో పాటు స్వర్ణకారులున్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కలెక్టరేట్, ఏప్రిల్ 27 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు ఔట్ సోర్సింగ్ ప్రాతిపాదికన భర్తీ చేసేందుకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలు విభాగాల్లో 50 టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టుల భర్తీకి ఇదివరకే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ ఇంటర్వ్యూలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ప్రభుత్వ జనరల్ దవాఖాన పర్యవేక్షకుడు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధి కల్పనా అధికారి రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య కేసులో నలుగురి రిమాండ్

బోయినిపల్లి, ఏప్రిల్ 27: మండల కేంద్రంలో ఈ నెల 22న సందరగిరి రాకేశ్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. రాకేశ్ తండ్రి మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు, మృతుడి సూసైడ్ నోట్ ఆధారంగా నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పృథ్వీధర్ గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సూసైడ్ నోట్‌లో ఉన్న నలుగురు యువకులు మృతుడి ప్రైవేట్ ఫొటోలు గూగుల్‌లో షేర్ చేస్తామని ఇబ్బందులకు గురి చేసి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారని విచారణలో తెలిసిందన్నారు. ఫొటోలు బయటకు వస్తే తన పరువు పోతుందని బయపడి రాకేశ్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు.

## యువకుడి ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27: బొప్పాపూర్‌నకు చెందిన యువకుడు గడ్డి నరేందర్ తనను మండల కేంద్రానికి చెందిన యువతి మోసం చేసిందని ఆరోపిస్తూ ఇటీవల పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోగా అతడి తల్లి పోలీస్‌స్టేషన్‌లో రేష్మపై ఫిర్యాదు చేసింది. దీంతో సదరు మహిళపై కేసు నమోదైన నేపథ్యంలో ఆదివారం డీఎస్పీ కే చంద్రశేఖర్‌రెడ్డి బొప్పాపూర్, ఎల్లారెడ్డిపేటలో విచారణ చేపట్టారు.